www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545


సంపుటి - 2 సంచిక -262 శుక్రవారం 6 డిసెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

- ఆత్మగౌరవంతో జీవించేందుకు
- ఇందిరమ్మ ఇళ్ల పథకం -రేవంత్ రెడ్డి
- ఇందిరమ్మ పథకంతోనే పేదల కల నెరవేరుతుంది
- ప్రత్యేక యాప్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్ ప్రజల కోసం మంచి సూచనలివ్వాలి
- అధికార, విపక్షాలు కలిసి పనిచేయాలి
- అసెంబ్లీకి వచ్చి మంచి, చెడ్డలపై వివరించాలి
- అవసరమైతే ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాలి
- ప్రజాపాలన విజయోత్సవాల్లో కేసీఆర్ పాల్గొనాలి
- మ్రాజీ సీఎం కేసీఆర్ను తప్పకుండా ఆహ్వానిస్తాం..
- మంత్రి పొన్నం, అధికారులు వెళ్లి ఆహ్వానిస్తారు





## ఇందిరమ్మ ఇళ్లతో పేదవాడికి
# ఆత్మగౌరవం

హైదరాబాద్ డిసెంబర్ 5 ప్రజావినికిడి,: ఆత్మగౌరవంతో బతకాలనేది పేదల కల అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్ ను ఇవాళ సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "రోటీ, కపడా, ఔర్ మకాన్ అనేది ఇందిరమ్మ నినాదమన్నారు. ఇల్లు, వ్యవసాయ భూమిని ప్రజలు ఆత్మగౌరవంగా భావిస్తామని పేర్కొన్నారు. అందుకే ఇందిరాగాంధీ దశాబ్దాల క్రితమే ఇళ్లు, భూపంపిణీ పథకాలను ప్రారంభించారని గుర్తు చేశారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చు కానీ.. ఇందిరమ్మ కాలనీ లేని ఊరు లేదన్నారు మిగతాది 2లో...

## పీఎస్ఎల్వీ-సి59 రాకెట్
# ప్రయోగం సక్సెస్...

- శాస్త్రవేత్తలను
- అభినందించిన ఇస్రో చైర్మన్
- శ్రీహరికోట నుంచి
- పీఎస్ఎల్వీ-సి50 ప్రయోగం
- నిర్దేశిత కక్ష్యలోకి
- ప్రోబా-3 ఉపగ్రహాలు



శ్రీహరికోట డిసెంబర్ 5 ప్రజావినికిడి,: శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుంచి నిర్వహించిన పీఎస్ఎల్వీ-సి59 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)కి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ-సి59 రాకెట్ అత్యంత కచ్చితత్వంతో, నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం సక్సెస్ అయిన నేపథ్యంలో, ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ శాస్త్రవేత్తలను అభినందించారు. సూర్యుడి బాహ్య వాతావరణం కరోనాపై ప్రోబా ఉపగ్రహాలు చేపట్టే ప్రయోగాలకు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నామని వెల్లడించారు. ఎన్ఎస్ఐఎల్ భాగస్వామ్యంతో ఈ ప్రయోగం చేపట్టామని తెలిపారు. పీఎస్ఎల్వీ రాకెట్ సామర్థ్యానికి ఈ ప్రయోగం గీటురాయిలా నిలుస్తుందని ఇస్రో ఓ ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ అంతరిక్ష ఆవిష్కరణల రంగంలో భారత్ కీలక పాత్ర ఈ ప్రయోగం ద్వారా స్పష్టమైందని వివరించింది.

## మధ్యాహ్న భోజనంపై నివేదిక ఇవ్వండి

- పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అంశంలో హైకోర్టు కీలక ఆదేశాలు
- భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై నివేదిక కోరిన హైకోర్టు
- ప్రభుత్వం రెండు కమిటీలను ఏర్పాటు చేసిందన్న ఏఏజీ
- నాణ్యమైన భోజనం కోసం నిధులను 40 శాతం పెంచినట్లు చెప్పిన ఏఏజీ



2లో.

## అల్లు అర్జున్, సంధ్య థియేటర్
# యాజమాన్యంపై కేసు

- తొక్కిసలాటకు థియేటర్
- యాజమాన్యమే కారణం
- మహిళ మృతికి కారకులపై కఠిన చర్యలు
- : సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్

4లో.





## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం

- డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్ పవార్
- సీఎంగా ప్రమాణం చేయించిన గవర్నర్ రాధాకృష్ణన్
- ముంబైలోని ఆజాద్ మైదానంలో ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరైన ప్రధాని, ఏపీ సీఎం, కేంద్రమంత్రులు



ముంబై, డిసెంబర్ 5 ప్రజావినికిడి,: ముంబైలోని ఆజాద్ మైదానంలో గురువారం జరిగిన భారీ కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఫడ్నవీస్ కు ఇది మూడోసారి. ఆజాద్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా శివసేన చీఫ్ ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇతర మంత్రులు ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రశ్నకు బీజేపీ (%ఎయజూ%) నేత సుధీర్ ముంగంటివార్ సమాధానమిస్తూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే కొత్త మంత్రివర్గం ఏర్పాటు అవుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమిలోని పార్టీల మధ్య రెండు వారాల తీవ్ర చర్చల తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. మిగతాది 2లో...

# రవాణా శాఖకు కొత్త లోగో

## -విజయాలపై బ్రోచర్ ఆవిష్కరించిన సీఎం రేవంత్, మంత్రి పొన్నం ప్రభాకర్

2లో.







## యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ

- తప్పులు చేస్తే ఉపేక్షించం
- నూతన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం
- జీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రా
- 2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగే అవకాశం

హైదరాబాద్,డిసెంబర్ 5 ప్రజావినికిడి,: యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని, కమిషన్?పై పూర్తి విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తామని నూతన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. మిగతాది 2లో...



## ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు



- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం
- మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్
- హరీష్‌తో పాటు కౌశిక్‌ను
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హరీశ్‌రావును గచ్చిబౌలి పీఎస్‌కు తరలింపు
- ఇది ప్రజాస్వామ్య పాలన కాదు..
- రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన..!
- రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు
- ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులా..?
- మా నాయకుల అరెస్ట్‌లు అప్రజాస్వామికం..
- తక్షణం విడుదల చేయాలి

హైదరాబాద్,డిసెంబర్ 5 ప్రజావినికిడి,: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన సమయంలో పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. మిగతాది 2లో...

# రవాణా శాఖకు కొత్త లోగో

## -విజయాలపై బ్రోచర్

## ఆవిష్కరించిన సీఎం రేవంత్, మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్‌డిసెంబర్ 5 ప్రజావినికిడి,:
ప్రజాపాలన- రవాణా శాఖ విజయోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ లోగో%ొ% ఆర్టీసీ సాధించిన విజయాలపై బ్రోచర్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో రవాణా శాఖ నిర్వహించిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులు, జీహెచ్‌ఎంసీ మేయర్, కార్పొరేషన్ల చైర్మెన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్క్రాపింగ్ పాలసీ ఆర్డర్స్, కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామకాల పత్రాలను అందజేశారు. రూ. 3902.31 కోట్ల విలువైన ఉచిత ప్రయాణానికి చెక్కులను అందజేశారు. ఏడాదికాలంలో 15.76 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని ఈ సందర్భంగా మంత్రి పొన్నం వివరించారు. తెలంగాణ ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని వివరించారు. ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్, ఆటోమెటిక్ డ్రైవింగ్ సెంటర్స్ తెస్తామన్నారు. ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన పార్కులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రోడ్ ప్రమాదాల నివారణకు కఠిన నిబంధనలు అమలు చేస్తామన్నారు. రవాణా శాఖ యూజర్ చార్జీలు వాడుకునేలా అనుమతి ఇవ్వాలని సీఎంను కోరారు. 'బస్ కా పయ్య నై చెలగా' అని ఆర్టీసీ కార్మికులు తెలంగాణ కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేండ్లుగా ఆర్టీసీ చంపి బొంద పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క బస్సు కొనుగోలు చేయలేదన్నారు. ప్రజా పాలనలో కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. 21 శాతం ఫిట్మెంట్ అందజేశామనీ, రూ. 280 కోట్లతో బాండ్స్ ఇచ్చామని తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ 10 నెలల్లోనే లాభాల్లోకి తెచ్చామని వివరించారు. దీనికి మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెల రూ. 350 -రూ.



400 కోట్లు ఆర్టీసీకి కేటాయించడం వల్ల ఆర్టీసీ లాభాల బాట పట్టిందన్నారు. ఆర్టీసీలో ఇంటర్నల్‌గా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామని వివరించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ, కొత్త ఎలక్ట్రిక్ బస్సుల పాలసీ రవాణా శాఖకు మరింత గౌరవాన్ని పెంపొందిస్తాయని మంత్రి వివరించారు.

ఏడాదిలో ఆర్టీసీ సాధించిన విజయాలివే - 1389 కొత్త బస్సుల కొనుగోలు
- మొదటిసారిగా హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో 10 రాజధాని ఏసీ బస్సులు%ొ%హైదరాబాద్ నుంచి పలు జిల్లా కేంద్రాలకు 75 డీలక్స్ బస్సులు, రాజధాని హైదరాబాద్‌లో 125 మెట్రో డీలక్స్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి.
- 446 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయనుంది. ఇప్పటికే 261 బస్సులు కొనుగోలు పూర్తి
- ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీని ప్రకటించింది. 21 శాతం ఫిట్ మెంట్ తో కూడిన వేతనాన్ని ఇచ్చింది.
- ఆర్పీఎస్-2013 బాండ్ల పెండింగ్ బకాయిలు రూ.280 కోట్లను విడుదల
- ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.కోటి ప్రమాద బీమా.
- హైదరాబాద్ తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కొత్తగా డిస్పెన్సరీ ఏర్పాటు
- ఆర్టీసీలో దాదాపు 12 ఏండ్ల తర్వాత 3038 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి
- పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో కొత్త డిపోల నిర్మాణం



- హుస్నాబాద్ బస్ స్టేషన్ సుందరీకరణ, జనగామ బస్ స్టేషన్ విస్తరణ
- హైదరాబాద్ మెట్రో ఎక్స్‌ప్రెస్ జనరల్ పాస్ దారులకు ఏసీ సర్వీసుల్లో 10 శాతం రాయితీ కల్పించడం
- ఎయిర్ పోర్ట్ మార్గంలో తిరిగే పుష్పక్ బస్సుల్లో ముగ్గురు అంత కన్నా ఎక్కువ మంది ఒకేసారి కలిసి ప్రయాణిస్తే టికెట్‌లో 10 శాతం రాయితీ
- ఏడాదిలో బస్ ఆన్ కాంట్రాక్ట్ కింద 15171 బస్సులను పెండ్లిళ్లు, ముహూర్తాలు, విహారయాత్రల కోసం అద్దెకు బస్సులు.
- కార్గో సేవలను మరింతగా విస్తరించడంలో భాగంగా రాజధాని హైదరాబాద్‌లో పార్శిళ్ల హోం డెలివరీ సదుపాయం
- బస్సుల కదలికలను పసిగట్టేందుకు 9320 బస్సులకు ట్రాకింగ్ సదుపాయం.వాటిని గమ్యం యాప్‌నకు అనుసంధానం.
- ప్రసిద్ధమైన మేడారం జాతరకు 3515 ప్రత్యేక బస్సులను సంస్థ నడిపింది.
- శ్రీ రామనవమి సందర్భంగా 47,092 మంది భక్తులకు భద్రాద్రి రాములోరి తలంబ్రాలను లాజిస్టిక్స్ విభాగం అందజేసింది.




# ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు

**(మొదటి పేజి తరువాయి)**
బలవంతంగా అదుపులోకి తీసుకుని గచ్చిబౌలికి తరలించారు. హరీష్ రావును ఎందుకు అదుపులోకి తీసుకున్నారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హరీష్‌రావుపై కేసు నమోదైంది. పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన సమయంలో అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు వాహనంలోకి ఎక్కే ముందు హరీష్ రావు తీవ్రంగా ప్రతిఘటించారు. బంజారాహిల్స్‌లోని కౌశిక్ రెడ్డి నివాసానికి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు చేరుకుంటున్నారు. హ?రీశ్ రావుతో పాటు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు హరీశ్ రావు అరెస్ట్ సందర్భంగా కౌశిక్ రెడ్డి ఇంటిని పోలీసులు ధ్వంసం చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ సిద్దిపేటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు.ఇక కౌశిక్ రెడ్డిని కలిసేందుకు వెళ్లిన హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ప్రజాస్వామ్య పాలన కాదు.. రాక్షస పాలన అని ధ్వజమెత్తారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇందిరమ్మ రాజ్యమా..? ఎమర్జెన్సీ పాలనా..? అని నిలదీశారు హరీశ్‌రావు. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఉల్టా కేసు బనాయించారు. ఉదయాన్నే పదుల సంఖ్యలో పోలీసులు ఎమ్మెల్యే ఇంటి మీదకు వచ్చి అక్రమ అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నిస్తే, నాపై, బీఆర్ఎస్ నాయకులపై దుర్మార్గంగా ప్రవర్తించారు. అక్రమ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నావు. నీ పిట్ట బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడే వాళ్ళం కాదు. తెలంగాణ సమాజమే నీకు బుద్ధి చెబుతుంది అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాగా ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రశ్నల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లనకు తరలిస్తున్నారు. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు.ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు..! పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు..! చేస్తున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు. పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు.. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు.. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు.. చివరకు ప్రజలపై కూడా కేసులు నమోదు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం హింసిస్తుందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసులు.. కేసులు.. కేసులు.. ఈ పేర్లతో అటు ప్రజలను, ఇటు ప్రతిపక్షాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాసులు మీకు %-% కేసులు మాకు.. సూటుకేసులు మీకు.. అరెస్టులు మాకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు మా నాయకులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి గార్లతోపాటు మా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం.. తక్షణం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చివరగా జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

# కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి

**ఆనాడు రేవంత్ రెడ్డిని చిన్న కేసులో అరెస్ట్ చేశారు**

**కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదు**

**మంత్రి కొండా సురేఖ ఆగ్రహం**

హైదరాబాద్‌డిసెంబర్ 5 ప్రజావినికిడి,: : బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చిన్న డ్రోన్ కేసులో కక్షపూరితంగా అరెస్ట్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయాక కార్యకర్తలు గుర్తుకువస్తున్నారని



విమర్శించారు.హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని గంధపు చెక్కల వ్యాపారి అంటూ ఒక బీఆర్ఎస్ నాయకుడు అగౌరవంగా మాట్లాడారని మండిపడ్డారు. కోమటిరెడ్డి సోదరుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ వారికి లేదన్నారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి రాజీనామా చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. అసెంబ్లీకి రాని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారని ప్రశ్నించారు. కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలన్నారు.

# మధ్యాహ్న భోజనంపై నివేదిక ఇవ్వండి

హైదరాబాద్ డిసెంబర్ 5 ప్రజావినికిడి,:
పాఠశాల్లలో విద్యార్థులకు తప్పనిసరిగా ప్ర భుత్వం నిర్దేశించిన మేరకు పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాల ని హైకోర్టు ఆదేశించింది. భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనల్లో నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అంశంపై పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. భోజనం వికటించిన ఘటనల్లో ప్రభుత్వం రెండు కమిటీలను ఏర్పాటు చేసిందని ఎఏజి హైకోర్టుకు వెల్లడించారు.ఈ ఘటనల్లో బాధ్యులైన వారిని ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. నాణ్యమైన భోజనం అందించేందుకు ఏజెన్సీలకు చెల్లించే నిధులను 40 శాతం పెంచినట్లు వెల్లడించారు. పిఎం పోషణ్ పథకంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఉండాలని విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. కమిటీల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ కమిటీలు సరిగ్గా పని చేసేలా ఆదేశించాలని కోర్టును కోరారు. తదుపరి విచారణను కోర్టు 6 వారాలకు వాయిదా వేసింది.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదవాడికి ఆత్మగౌరవం

**(మొదటి పేజి తరువాయి)**
రూ.10వేలతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇవాళ రూ.5లక్షలకు చేరుకుందన్నారు రేవంత్. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన వారికే ప్రభుత్వ ఇల్లు చెందాలనేది ఈ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. గతంలో కేసీఆర్ రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించామని అంటూ.. తొలి దశలో 4.50లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చాం" అని రేవంత్ అన్నారు.
కాగా, ఇందిరమ్మ ఇళ్ల పథకం మొబైల్ యాప్ ద్వారా శుక్రవారం నుంచి లబ్ధిదారుల పేర్లను నమోదు చేయనున్నారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్ ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల ఎంపిక చేయనున్నారు.ప్రభుత్వానికి విపక్షాలు సూచనలు ఇచ్చే సంప్రదాయం గతంలో ఉండేదని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. ఆ సంప్రదాయాన్ని ఇప్పుడు దెబ్బతీస్తున్నారన్నారు. పాలక, ప్రతిపక్షాలు శత్రుపక్షాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. పాలక, ప్రతిపక్షాలు కలిస్తేనే ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో ఇరుపక్షాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందన్నారు. పెద్దమనిషిగా కేసీఆర్ సూచనలు చేయాలని హితువుపలికారు. "మాకేమీ భేషజాలు లేవు.. పాలక పక్షాన్ని ప్రశ్నించండి. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలి. అవసరమైన సూచనలు చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం

**(మొదటి పేజి తరువాయి)**ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలైన శివసేన, ఎన్సీపీలతో కలిసి బీజేపీ నేతృత్వంలోని మహాకూటమికి 230 సీట్లు సాధించింది. బీజేపీ ఒంటరిగా 132 సీట్లు గెలుచుకుంది.మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారానికి పలువురు సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో పలువరు కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్, పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, సంజయ్ దత్, మాధురి దీక్షిత్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సకుటుంబ సపరివారంగా హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమానికి సుమారు 40 వేల మంది బీజేపీ మద్దతుదారులు, మతపెద్దలు హాజరయ్యారు.రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఫడ్నవీస్ రెండోసారి 2014 నుంచి 2019 వరకు బీజేపీ-శివసేన ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. 2019 ఎన్నికల తరువాత, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన సిఎం పదవి కోసం బిజెపితో సంబంధాలు తెంచుకున్నప్పుడు, ఫడ్నవీస్ తిరిగి అజిత్ పవార్ మద్ధతుతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఎన్సీపీ ఎమ్మెల్యేల నుంచి తగినంత మద్దతు పొందడంలో అజిత్ పవార్ విఫలం కావడంతో ఈ ప్రభుత్వం కేవలం 72 గంటలు మాత్రమే కొనసాగింది. అనంతరం, శివసేనలో చీలిక రావడంతో షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఫడ్నవీస్ డిప్యూటీ సీఎం అయ్యారు.

# యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ

**(మొదటి పేజి తరువాయి)**
గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్?గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషన్ సభ్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీజీపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎడ్యుకేషన్?లో ఉన్న సమయంలో 60 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రతి పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాసభరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్?ను వదులుకుని టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలని, టీజీపీఎస్సీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా అంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషన్?కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ కూడా కేటాయిస్తామని ప్రకటించారు. టీజీపీఎస్సీకి స్వయం ప్రతిపత్తి ఉందని, దీంతో ఎవరికీ భయపడకుండా పని చేస్తామని ఉద్ఘాటించారు. ఎవరూ తప్పులు చేసినా ఉపేక్షించమని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఉండటం వల్ల ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నల్లో తప్పులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ పదవిలోకి రావడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. తాను కూడా ప్రిపేర్ అయ్యే సమయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ కరెక్ట్?గా పనిచేయడంతోనే తనకు ఉద్యోగం వచ్చిందని గుర్తు చేసుకున్నారు.టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బుర్రా వెంకటేశం 2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నారు. ఐఏఎస్?కు బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ, గవర్నర్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా, జేఎన్?టీయూహెచ్ వీసీగా బుర్రా వెంకటేశం రిలీవ్ అయ్యారు.

# ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

**- హెచ్ పి పెట్రోల్ పంపు సమీపంలో ప్రమాదం**

**- ఇరువురికి తీవ్ర గాయాలు, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు**

రాయపర్తి, డిసెంబర్ 5 ప్రజావినికిడి,: రాయపర్తి మండల సమీపంలో గురువారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వాహనదారులు ఇరువురు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించిందని తెలుపుతున్నారు. వాహనదారులు ఇరువురు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు చెబుతున్నారు. ఈ ప్రమాదానికి గురైన వారిలో రాయపర్తి మండలం మైలారం గ్రామాన్ని చెందిన బిక్షపతి, మరో వ్యక్తి ఐనవోలు మండలం గర్నెపెల్లి గ్రామానికి చెందిన రాజేష్ లుగా స్థానికులు గుర్తిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి వుంది.

# అల్లు అర్జున్, సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు

## తొక్కిసలాటకు థియేటర్ యాజమాన్యమే కారణం

## మహిళ మృతికి కారకులపై కఠిన చర్యలు : సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్

ముషీరాబాద్‌డిసెంబర్ 5 ప్రజావినికిడి,:
సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటకు సినీ హీరో అల్లు అర్జున్, థియేటర్ యాజమాన్యం, హీరో వ్యక్తిగత సిబ్బంది కారణమని, వారిపై కేసులు నమోదు చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. బుధవారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్‌కు సినీ హీరో అల్లు అర్జున్ వచ్చిన సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతిచెందిన విషయం విదితమే. ఆమె కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై గురువారం రాత్రి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ రమేష్ కుమార్‌తో కలిసి సెంట్రల్ జోన్ డీసీపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో షెడ్యూల్ వేయడంతో భారీగా అభిమానులు వచ్చారని తెలిపారు. హీరో అల్లు అర్జున్ వస్తున్నారని తెలియడంతో ప్రేక్షకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్ గేట్లను తోసుకుంటూ లోపలికి చొచ్చుకొని వెళ్లారన్నారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి(35), ఆమె కుమారుడు 13 ఏండ్ల శ్రీతేజ్ కింద పడగా.. జనం కాళ్ల మధ్య నలిగిపోయి అపస్మారక స్థితిలోకి



వెళ్లిపోయారని తెలిపారు. వెంటనే పోలీసులు వారికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించినా.. రేవతి మృతిచెందిందని చెప్పారు. శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందిస్తున్నారని తెలిపారు. సంధ్య థియేటర్‌లో రద్దీని నివారించడానికి థియేటర్ యాజమాన్యం భద్రతకు సంబంధించి ఎలాంటి అదనపు నిబంధనలూ పాటించలేదన్నారు. యాజమాన్యానికి నటీనటుల రాక గురించి సమాచారం ఉన్నప్పటికీ ప్రత్యేక ప్రవేశం లేదా నిష్క్రమణ ఏర్పాట్లు చేయలేదన్నారు. అయినప్పటికీ అల్లు అర్జున్ వ్యక్తిగత భద్రతతో థియేటర్లోకి వచ్చారని.. అప్పటికే అక్కడ గుమిగూడిన ప్రజలందరూ ఒక్కసారిగా అతనితో పాటు లోపలికి వెళ్లడంతో వ్యక్తిగత సిబ్బంది ప్రజలను నెట్టడం ప్రారంభించార న్నారు. దాంతో తీవ్ర తోపులాట జరిగి మహిళ మృతికి కారకులయ్యారన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 105,118(1) రీ/వ 3(5) బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. థియేటర్ లోపల ఒక వ్యక్తి మరణంతోపాటు ఇతరులు గాయపడటానికి దారితీసిన పరిస్థితులకు కారణమైన అందరిపైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్ఐలు పాల్గొన్నారు.

### బాలుడి పరిస్థితి విషమం!

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తల్లిని కోల్పోయి, తానూ తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైన బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలునికి బేగంపేట కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, బాలుని తల్లి రేవతి మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

# 7న తెలంగాణకు బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా

డిసెంబర్ 5 ప్రజావినికిడి,:
తెలంగాణ రాష్ట్రంలో ఓ పక్క విజయోత్సవాలు, మరోపక్క అరెస్టులు..ఇంకో పక్క నిరసన సభలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనికి కౌంటర్‌గా బీజేపీ ఇప్పటికే కాంగ్రెస్ 6 హామీలు, 66 అబద్దాలు పేరిట రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 7న హైదరాబాద్ నగరంలోని సరూర్ నగర్ స్టేడియం లో కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ నిరసన సభ నిర్వహిస్తున్నారు.



ఈ సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.అయితే ఈ నిరసన సభకు కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరు కానున్నట్లు ఆ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ సభను విజయవంతం చేసి కాంగ్రెస్ పార్టీ పై ఉన్న వ్యతిరేకతను రాష్ట్ర ప్రజలకు చాటేందుకు బీజేపీ భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నగరంలో గత కొంత కాలంగా హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీజేపీ పోరాటం చేస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా హైడ్రా, మూసీ బాధితులను పెద్ద ఎత్తున బీజేపీ సభకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం అందుతోంది.

# పారిశ్రామికంగా బుగ్గపాడును అభివృద్ధి చేస్తాం:మంత్రి శ్రీధర్ బాబు

డిసెంబర్ 5 ప్రజావినికిడి,:
పారిశ్రామికంగా బుగ్గపాడు ఫుడ్ పార్క్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, బుగ్గపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్‌పార్క్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎంఎల్ఎ డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా చైతన్య వంతమైన జిల్లా అని, రాజకీయంగా, విద్యాపరంగా ముందున్నదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు సత్తుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించారని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హయాంలో ఇక్కడ రోడ్లు, కాలువలు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి తుమ్మల ప్రతి రోజు ఈ ఫుడ్ పార్క్ ను ప్రస్తావిస్తూ, ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను సంప్రదించి ఫుడ్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఐటి రంగం, ఉపాధి కల్పన జరగాలని, స్థానిక నిరుద్యోగ యువతకు బంగారు భవిష్యత్తు కల్పించాలని ప్రభుత్వం పనిచేస్తోదన్నారు.
గతంలో తమ ప్రభుత్వ హయాంలో మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దామని, నేడు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమానికి నాంది పలికామన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతోందని మంత్రి తుమ్మల విస్తృతంగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో అందుబాటులో ఉన్న రా మెటీరియల్ వాల్యూ అడిషన్ చేస్తూ శాస్త్రీయబద్ధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఆహ్వానం పలుకుతామని, రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలకు సబ్సిడీలు అందిస్తూ స్థానిక



యువతకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాలలో వాటా కల్పించింది ప్రజా ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. ఇక్కడ పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. ఖమ్మంలో గ్రానైట్, రైస్‌మిల్లర్లు, జిన్నింగ్ మిల్లు తదితర 2300 పైగా పరిశ్రమలున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో 10 వేల ఎం.ఎస్.ఎం.ఈ. పరిశ్రమలు ఏర్పాటు కావాలన్నారు.వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఫుడ్ పార్క్‌లో అధిక పరిశ్రమలు తీసుకుని వచ్చి ఈ ప్రాంత రైతులు పండించే జామ, కొబ్బరి, ఆయిల్ పామ్ మొదలగు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని అన్నారు. బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్క్ లో మొత్తం 200 ఎకరాలకు పైగా అందుబాటులో ఉందని, దీనిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొని రావాలన్నారు. ఆహారశుద్ధి పరిశ్రమల ద్వారా రైతుల ఆదాయం పెరగాలని, అటువంటి పరిశ్రమలు టి.జి.ఐ.ఐ.సి. అధికారులు తీసుకుని రావాలన్నారు. సభా స్థలి వద్ద తెలంగాణ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్, తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు వారు ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ స్టాల్‌లను మంత్రులు, ఎమ్మెల్యే పరిశీలించి ఎల్లో అండ్ గ్రీన్ టెక్నాలజీస్ సంస్థను ప్రారంభించారు. స్థానిక ఎంఎల్ఎ డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ.. బుగ్గపాడు గ్రామంలో మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటు కోసం ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో భూమిని కేటాయించారని,గత పాలకులు ఈ ఫుడ్‌పార్క్‌పై నిర్లక్ష్యం వహించగా, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మౌలిక వసతుల పనులలో వేగం పెంచి నేడు ప్రారంభిస్తున్నామన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో జలగం వెంగళరావు, తుమ్మల నాగేశ్వరరావు, జలగం వెంకట్రావు వంటి మహనీయులు ప్రాతినిధ్యం వహించిన స్థానం నుంచి మహిళగా తాను ప్రాతినిధ్యం వహించడం చాలా గర్వంగా ఉందన్నారు. సత్తుపల్లిలో సింగరేణికి సంబంధించిన నాణ్యమైన బొగ్గు అందుబాటులో ఉందని, ఇక్కడ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, బొగ్గు ఆధారిత చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పొలాలకు వెళ్లే మార్గాల్లో రోడ్లు వేయాలని, బేతుపల్లి కాలువ, లంకాసాగర్ ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. ఫుడ్‌పార్క్ పరిధిలో లక్ష ఎకరాల వరకు వ్యవసాయ భూమి క్యాచ్మెంట్ ఏరియాగా ఉందని, ఇక్కడ పండించే పంటలు ఆహార శుద్ధి పరిశ్రమకు ఉపయోగపడతాయన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న నేపథ్యంలో సత్తుపల్లి నుంచి బుగ్గపాడు వరకు భారీ మోటర్ సైకిల్ కార్ల ర్యాలీ నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, టి.జి.ఐ.ఐ.సి. ఛైర్మన్ టి. నిర్మల జగ్గారెడ్డి, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, ఈ.డి పవన్ కుమార్, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర సాయుధ బలగాల్లో భారీగా ఉద్యోగ ఖాళీలు

**సీఏపీఎఫ్ బలగాల్లో లక్షకుపైగా ఉద్యోగాలు**
**యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ ద్వారా నియామకాలు**
**ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు సత్వర చర్యలు**
**రాజ్యసభలో కేంద్రమంత్రి నిత్యానంద రాయ్ వెల్లడి**



న్యూఢిల్లీ, డిసెంబర్ 5 ప్రజావినికిడి,: కేంద్ర సాయుధ బలగాలు, అస్సాం రైఫిల్స్ లో లక్షకు పైనే ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. గత ఐదేళ్లలో దాదాపు 71,231 పోస్టులు భర్తీ చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానంలో బుధవారం వెల్లడించారు. ఖాళీగా ఉన్న సీఏపీఎఫ్, ఏఆర్ ఉద్యోగాల్లో చాలా వరకు పదవీ విరమణ, రాజీనామాలు, పదోన్నతులు, మరణాలు, కొత్త బెటాలియన్ ఏర్పాటు, కొత్త పోస్టులను సృష్టించడం వంటి వాటివల్ల ఏర్పడినట్లు తెలిపారు. విభాగాల వారీగా ఖాళీలు పరిశీలిస్తే.. అక్టోబర్ 30 నాటికి సీఏపీఎఫ్, ఏఆర్‌లో మొత్తంగా 1,00,204 పోస్టులు ఖాళీగా ఉన్నాయి . అందులో అత్యధికంగా సీఆర్‌పీఎఫ్‌లో 33,730 పోస్టులు, సీఐఎస్ఎఫ్‌లో 31,782 పోస్టులు, బీఎస్ఎఫ్‌లో 12,808 పోస్టులు, ఐటీబీపీలో 9,861 పోస్టులు, ఎస్ఎస్‌బీలో 8,646 పోస్టులు, అస్సాం రైఫిల్స్‌లో 3377 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ ద్వారా ఈ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు మంత్రిత్వశాఖ చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు వైద్య పరీక్షలకు సంబంధించి సమయాన్ని తగ్గించడం, కానిస్టేబుల్ జీడీ కోసం షార్ట్ లిస్ట్ అయిన అభ్యర్థుల కటాఫ్ మార్కులను తగ్గించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇక కేంద్ర సాయుధ బలగాల్లో పనిచేసే సిబ్బంది శ్రేయస్సుకు కేంద్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సీఏపీఎఫ్ సిబ్బందికి ఏడాదిలో 100 రోజులు వారంతా కుటుంబంతో గడిపేలా మంత్రిత్వశాఖ కృషిచేస్తోందని తెలిపారు. 2020 నుంచి 2024 అక్టోబర్ వరకు 42,797 మంది సీఏపీఎఫ్, ఏఆర్ సిబ్బంది 100 రోజుల సెలవులు వినియోగించుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# ప్రయాణికులకు తీపికబురు చెప్పిన రైల్వే

## జనరల్ బోగీలను పెంచనున్న సౌత్ సెంట్రల్ రైల్వే

న్యూఢిల్లీ, డిసెంబర్ 5 ప్రజావినికిడి,: ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను దశలవారీగా పెంచుతున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు రెండే జనరల్ కోచ్ లు ఉన్న రైళ్లలో ఆ సంఖ్యను నాలుగుకు చేరుస్తున్నట్లు పేర్కొన్నారు. అవి కూడా ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఎల్.హెచ్.బి కోచ్ లు ఉంటాయని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. జోన్ పరిధిలోని 21 జతల రైళ్లకు అదనగా 80 ఎల్.హెచ్.బి బోగీలను అందుబాటులోకి తీసుకొస్తామన్న సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు. రైళ్లలో పేదలు ప్రయాణించే జనరల్ బోగీల రూపం కూడా మారబోతున్నది. ఇన్నాళ్లు రైళ్లలో పాతకాలం నాటి సాధారణ బోగీలే ఉన్నాయి. చాలా రైళ్లలో రెండే బోగీలు ఉండటంతో పేద ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాని కారణంగా జనరల్ బోగీల సంఖ్యను పెంచేందుకు రైల్వేబోర్డు కార్యాచరణ ప్రారంభించింది. కొత్తగా వస్తున్న జనరల్ బోగీలను ఎల్.హెచ్.బి పరిజ్ఞానంతో తయారుచేసినవి ప్రవేశ పెడుతున్నారు. పాత తరం ఐసీఎఫ్ బోగీల్లో 90 సీట్లు ఉంటే.. ఎల్.హెచ్.బి బోగీల్లో సీట్ల సంఖ్య 100 ఉంటాయి. ఇందులో ఎక్కువ మంది ప్రయాణించే అవకాశం ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు సైతం తక్కువ నష్టం ఉంటుందంటున్న రైల్వే అధికారులు. ఏసీ, స్లీపర్ క్లాస్ లలో మాత్రమే ఎల్.హెచ్.బి బోగీలను రైల్వే శాఖ ప్రవేశపెడుతూ వచ్చింది. కానీ తాజాగా ఇప్పుడు జనరల్ క్లాస్ లలో ఎల్.హెచ్.బి కోచ్ లను అందుబాటులోకి ఇస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే. ఇప్పటికే జోన్ పరిధిలో 19 ఎక్స్ ప్రెస్ రైళ్లకు ఎల్.హెచ్.బి కోచ్లను 66 కోచ్లను ప్రవేశపెట్టారు. గౌతమి, దక్షిణ్, నారాయణాద్రి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి జనరల్ కోచ్ లు వచ్చాయి. రైల్వేశాఖ దేశవ్యాప్తంగా 370 రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి బోగీలను దశలవారీగా జత చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఫలితంగా రోజూ అదనంగా 70 వేల మంది ప్రయాణికులు జనరల్ బోగీల్లో ప్రయాణించేందుకు ఆస్కారం ఉంటుంది. సాధారణ ప్రయాణికులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# ‘ఆదర్శ’ పాఠశాలలో ఐదుగురు విద్యార్థినులకు అస్వస్థత



నల్లగొండ డిసెంబర్ 5 ప్రజావినికిడి,: కడుపునొప్పితో పాటు వాంతులు చేసుకొని ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన నల్లగొండ జిల్లా, దేవరకొండ మండలం, పెంచికల్‌పహాడ్‌లోని ఆదర్శ బాలిక పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. పెద్దఅడిశర్లపల్లి మండలం, దుగ్యాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన మరువకముందే తాజాగా దేవరకొండ మోడల్ స్కూల్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అనుష, అనుష, అనన్య, 6వ తరగతి చదువుతున్న మంగ్త, ఉదయ్ మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత కడుపునొప్పితోపాటు వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని 108 వాహనంలో హుటాహుటిన దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు.అయితే, వీరిలో ఇద్దరు జ్వరంతో మరో ముగ్గురు వాంతులు, కడుపునొప్పితో బాధపడుతున్నట్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ మంగ్తనాయక్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ మాతృనాయక్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఇదిలా ఉండగా వరుస అస్వస్థత సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలు అస్వస్థతకు గురై ఇబ్బందులు పడుతున్నా పాఠశాల ఉపాధ్యాయుల నుండి తమకు ఎటువంటి సమాచారం అందించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్

అమరావతి డిసెంబర్ 5 ప్రజావినికిడి,:

కృష్ణా జిల్లాలో రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ ఘటనలో ఇద్దరు అధికారులు కస్టోడియల్ ఆఫీసర్, టీఏలను సస్పెండ్ చేసింది. లారీల్లో ఎక్కువ బస్తాలు ధాన్యం లోడ్ చేస్తూ..., రికార్డులలో మాత్రం తక్కువ చూపిస్తున్న వైనంపై బుధవారం మీడియా ప్రతినిధులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి ఈ అవకతవకల ఘటనపై ఆధారాలను స్వయంగా పరిశీలించారు. రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించి..., రికార్డుల్లో మాత్రం తక్కువ చూపిస్తూ... అధికారులు - మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారంటూ రైతుల నుంచి ఆరోపణలు వచ్చాయి. రైతుల ఫిర్యాదులపై గత రాత్రి సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. రైతుల నుండి నిరంతరంగా ధాన్యం కొనుగోలు జరగాలని ఆదేశించారు. పౌరసరఫరాల, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసి ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా అవకతవకలు ఆధారాలను మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. శాఖపర చర్యలకు ఆదేశించారు. కస్టోడియల్ ఆఫీసర్, టీఏలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రభుత్వ చర్యలతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఫిర్యాదు చేసిన రైతులకు ఎమ్మార్వోల నుంచి ఫోన్లు వెళ్లాయి. వ్యక్తిగతంగా కలిసి సమస్య పరిష్కరించుకోవాలంటూ కొందరు రైతులకు ఎమ్మార్వో ఫోన్ చేశారు. కాగా



రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ మన్‌జీర్ జిలానీ అమూన్ ఆదేశాల మేరకు అధికారులు రైసు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, లీగల్ మెట్రాలజీ, పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక బృందాలు బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కృష్ణా జిల్లాలోని రైసు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాయి. ధాన్యం తూకాల్లో కోతలు విధిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖరీఫ్ ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. కాగా 'దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోండి. మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది. 12 గంటల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తుంది.' అని రైతులకు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలో తుఫాను కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన ఆయనకు మాజేరు వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన, టీడీపీ నేతలు స్వాగతం పలికారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల పరిధిలోని పాతమాజేరు, లంకపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం అడ్డరోడ్డు, చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డు, కాసానగర్, పెదప్రోలు ప్రాంతాల్లో హైవేపై దారి పొడవునా ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులున్న ప్రతిచోటా వాహనం దిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షానికి ధాన్యం తడవడం, కొద్దిమేర మొలకెత్తటం, తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టుకుంటున్నామని, తేమశాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదని, తీసుకున్నా తక్కువ ధర ఇస్తున్నారని రైతులు మంత్రికి తెలిపారు. 1262, 1224 రకం ధాన్యం కొనుగోలు చేయటంలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి గింజా ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని, దళారులను ప్రోత్సహించవద్దని, సమస్యలుంటే రైతుసేవా కేంద్రానికి వెళ్లాలని రైతులకు మంత్రి సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని సాయంత్రంలోగా కొనుగోలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. తేమ 24శాతం వరకూ కొనుగోలు చేయాలని ఆదేశించామన్నారు. 1262 రకం కొనుగోలుపై ఇప్పటికే మాట్లాడామని, 1224 రకం కొనుగోలులోనూ ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు. మిల్లర్లు, అధికారులతో ఇబ్బందులుంటే ఆర్డీవో దృష్టికి తేవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

# ఏపీ ప్రభుత్వం, గూగుల్ మధ్య కీలక ఒప్పందం


### టెక్నాలజీ అందిపుచ్చుకోవడంలో ఏపీ కీలక ముందుడుగు

### నారా లోకేశ్ చొరవతో రాష్ట్రానికి మరింత మెరుగైన ఏఐ సాంకేతికత

### ముందుకొచ్చిన గూగుల్ కుదిరిన ఎంవోయూ

అమరావతి డిసెంబర్ 05, జర్నలిస్టు జర్నీ న్యూస్ : ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన తొలి అడుగు వేసింది. ఏఐ రంగంలో అధునాతన ఆవిష్కరణల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్ మ్యాప్స్ ఇండియా జనరల్ మేనేజర్ లలితా రమణి, ఏపీ రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ సచివాలయంలో ఎంవోయూ కుదుర్చుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ఈజ్ ఆఫ్ లివింగ్ తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. దైనందిన జీవితంలో ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి అందుబాటులో ఉండే సెల్ ఫోన్ వంటి సాధనం ద్వారా ఆయా సేవలను అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

యువతకు ఏఐ ఆధారిత భవిష్యత్ అవకాశాలను కల్పించేందుకు గూగుల్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు



మెరుగైన సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని తెలిపారు.

గూగుల్ తో తాము చేసుకున్న ఒప్పందం ద్వారా ఏఐ రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోవడంతోపాటు యువతకు అంతర్జాతీయస్థాయి నైపుణ్య శిక్షణ లభిస్తుందని, తద్వారా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

పరిపాలన వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ను ఉపయోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకుంటున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి తెలిపారు. తాము ఏపీ ప్రభుత్వంతో కలిసి చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్తు ఏఐ ఆధారిత సేవల్లో సాధికారిత సాధించడానికి ఆలంబనగా నిలుస్తాయని అన్నారు. ఏఐ ద్వారా సమాజానికి సానుకూల ప్రయోజనాలను పెంచడానికి కట్టుబడి ఉంది.

**గూగుల్ ఒప్పందంలోని కీలకాంశాలు**

- విద్య, నైపుణ్యాభివృద్ధి: విద్యార్థులు, డెవలపర్లకు ఏఐ ఆధారిత నైపుణ్యాల కోసం 10 వేల మందికి గూగుల్ ఎసెన్షియల్ పేరుతో నైపుణ్య శిక్షణ కోర్సు అందిస్తుంది. రోజువారీ జీవితంలో %ూ×%ని ఎలా ఉపయోగించాలి, ఏఐ ద్వారా ఉత్పాదకత, సామర్థ్యాన్ని పెంచడం వంటివి ఈ కోర్సులో అంతర్భాగంగా ఉంటాయి. సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ జనరేటివ్ వంటి రంగాల్లో క్లౌడ్ సర్టిఫికేషన్‌లు, స్కిల్ బ్యాడ్జ్‌లను గూగుల్ అందజేస్తుంది. ప్రభుత్వ ఏజెన్సీల కోసం స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లను అందించడానికి ప్రభుత్వంతో సహకరిస్తుంది. కంప్యూటర్ సైన్స్ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అధ్యాపకులకు గూగుల్ సాంకేతిక మద్దతును అందిస్తుంది. స్కిల్లింగ్ ఇనిషియేటివ్‌లలో డెవలపర్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లు, ఆండ్రాయిడ్, యాప్ స్కిల్లింగ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లకు గూగుల్ ద్వారా యాక్సెస్ లభిస్తుంది.
- స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎనేబుల్ మెంట్: ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం, మెంటర్‌షిప్, నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించడం, స్టార్టప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ల కోసం యాక్సెస్‌ని అందిస్తుంది. ఇందుకోసం సంస్థ ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌తో కలిసి పనిచేస్తుంది. దీంతోపాటు అర్హత కలిగిన స్టార్టప్‌లు క్లౌడ్ క్రెడిట్‌లు, సాంకేతిక శిక్షణ వ్యాపార మద్దతును పొందుతాయి.
- సుస్థిరత: గాలి నాణ్యత, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడంలో గూగుల్ ఏఐ ఆధారిత సహకారం, సేవలను అందిస్తుంది.- హెల్త్‌కేర్: నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపర్చడం, రోగి ఆరోగ్య ఫలితాలను వేగవంతం చేయడంలో ఏఐ సేవల వినియోగానికి సహకారం అందించడం, హెల్త్ ఇమేజింగ్ మోడల్‌లకు యాక్సెస్ అందించడం, ద్వారా హెల్త్‌కేర్ ఉత్పాదకరంలో అప్లికేషన్‌లను అన్వేషించడం, హెల్త్ డెవలపర్ ఫౌండేషన్స్ ) ద్వారా పరిశోధన కార్యక్రమాలకు గూగుల్ మద్దతు ఇస్తుంది.
- పైలట్‌లు: వ్యవసాయం, ట్రాఫిక్ నిర్వహణ, వెబ్‌సైట్ ఆధునీకరణ, పౌరుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలలో క్లౌడ్ టెక్నాలజీ, ప్రయోజనాలపై కీలక రంగాలలో పైలట్ ప్రాజెక్ట్‌లకు సహకరిస్తుంది.

# ధాన్యం కొనుగోలులు సాఫీగా సాగాలి

**ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదు**

**నిర్లక్ష్యంగాఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు**

**ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

**ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు**

**1.51 లక్షల మంది రైతులకు**

**రూ.2,331 కోట్ల చెల్లింపులు**

**ఏపీలో ధాన్యం కొనుగోలుపై సీఎం సమీక్ష**



అమరావతి డిసెంబర్ 5 ప్రజావినికిడి,:

ఏపీలో ధాన్యం కొనుగోలుపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగాఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. 1.51 లక్షల మంది రైతులకు రూ. 2,331 కోట్ల చెల్లింపులు జరిగినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. గతేడాది ఈ సమయానికి.. 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ జరిగిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 10.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం ఒక రికార్డు అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తులోనూ రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. వరి కోతలకు ఎక్కువగా యంత్రాలు ఉపయోగిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ధాన్యం మిల్లులకు రావడంతో రద్దీ ఎక్కువైంది. తేమ శాతంలో గందరగోళం ఏర్పడింది. నిబంధనల ప్రకారం తేమ శాతం 17 అయితే.. దీనికి మరో 5 శాతం కలిపి రైతులకు మద్దతు ధర తగ్గకుండా కొనుగోలు చేయాలని మిల్లర్లను ప్రభుత్వం ఆదేశించింది. రైతులను ఇబ్బంది పెట్టే దళారులపై చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించింది.ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల కంకిపాడు మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ, నగదు చెల్లింపు ప్రక్రియపై రైతులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ అవస్థలను మంత్రికి వివరించారు. మిల్లర్లు, వ్యాపారులు కుమ్మక్కై ధాన్యం ధరను తగ్గిస్తున్నారని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. తేమ నెపంతో మద్దతు ధర కంటే మూడు వందల మేర తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై ఏపీ ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. వికేంద్రీకరణ విధానంలో రైతు సేవా, ధాన్యం సేకరణ కేంద్రాలు, ఈ- పంట, ఈకేవైసీ ద్వారా కొనుగోళ్లు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కామన్ వెరైటీ ధాన్యం కనీస మద్దతు ధర రూ. 2,300, గ్రేడ్ ఏ రకం కనీస మద్దతు రూ. 2,320 చెల్లించాలని స్పష్టం చేసింది. ఖరీఫ్ సీజన్‌లో 37లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రాంకో కి అసైన్డ్ భూములు

### కేటాయించిన జగన్- అధికారులకు హైకోర్టు నోటీసులు



అమరావతిడిసెంబర్ 5 ప్రజావినికిడి,: నిరుపేదలకు చెందాల్సిన అసైన్డ్ భూములు జగన్ ప్రభుత్వం అక్రమంగా కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసిందంటూ నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలానికి చెందిన వంకదార చిన చెన్నప్ప హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై నేడు హైకోర్టులో వాదనలు జరిగాయి.. పిటిషనర్ తరుపున న్యాయవాది శ్రవణ్ కుమార్ తన వాదలను వినిపించారు..ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలన్న నేపంతో వందల కోట్ల విలువైన అసైన్డ్ భూమిని రాంకో సిమెంట్ పేరిట అధికారులు బదలాయించారని వాదించారు.రాంకో సిమెంట్ పేరిట బదలాయించిన భూమి ఇప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమి గానే నమోదయిందని వివరించారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల లో ఉన్న మొత్తం 1926 ఏకరాల భూమిని పేదప్రజలకు అసైన్మెంట్ చేసి మరుక్షణమే రాంకో సిమెంట్ పేరిట రెవెన్యూ , రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు బదాలాయించేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. తన వాదనను సమర్థిస్తూ 900 పేజీల ఆధారాలు హైకోర్టు సమర్పించారు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్.వేలాది అసైన్మెంట్ ఎకరాలు పేద ప్రజలను మోసం చేస్తూ కేటాయింపులు జరగకుండానే కార్పొరేట్ సంస్థలకు బదలాయించటం చట్ట విరుద్ధం అని అన్నారు.. కాగా, న్యాయవాది శ్రవణ్ కుమార్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం తక్షణమే రామ్ కో సిమెంట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. అలాగే ప్రిన్సిపల్ సెక్రెటరీ పంచాయతీరాజ్, రెవిన్యూ మరియు జిల్లా కలెక్టర్ ను కౌంటర్ దాఖలు చేయవలసిందిగా కోరింది.. తదుపరి విచారణను మూడు వారాలు వాయిదా వేసింది.

# రేషన్ అక్రమాలపై ఎట్టిపరిస్థితుల్లో వెనక్కి తగ్గొద్దు

### పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై పీడీ యాక్ట్ కింద కేసులు

### పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

### కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష



అమరావతి డిసెంబర్ 5 ప్రజావినికిడి,: :పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నాదెండ్ల కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా రేషన్ బియ్యం విషయంలో అక్రమాలపై ఎట్టిపరిస్థితుల్లో వెనక్కి తగ్గొద్దని అధికారులకు సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై నేర తీవ్రతను బట్టి పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. 6(ఏ) కేసులు, సీజ్ చేసే విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. అలాగే జిల్లాల్లో ధాన్యం సేకరణ, సమస్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇక ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# కడపకు డిప్యూటీ సీఎం పవన్..



డిసెంబర్ 5 ప్రజావినికిడి,:

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 7వ తేదీన కడప జిల్లాలో పర్యటించనున్నారు. కడప మున్సిపల్ హైస్కూల్ లో జరిగే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి హోదాలో తొలిసారి పర్యటనకు వస్తుండటంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అభిమానుల తాకిడి లేకుండా పెద్దయెత్తున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

# విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్




హైదరాబాద్, డిసెంబర్ 5 ప్రజావినికిడి,: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన కొనసాగుతారని పేర్కొన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను ప్రభుత్వం టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన వాలంటరీ రిటైర్‌మెంట్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఈ నేపథ్యంలో వెంకటేశం స్థానంలో ఎన్.శ్రీధర్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. శ్రీధర్ 1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు క్యాడర్లలో సేవలందించారు. మొదట రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా, ఊట్నూరు ఐటీడీఏ పీఓగా, పోర్ట్స్ డైరెక్టర్‌గా కాకినాడలో పని చేశారు. అనంతరం అనంతపురం, కృష్ణ, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో స్పెషల్ సెక్రెటరీగా మూడేళ్ల మూడు నెలల పాటు పని చేశారు. తెలంగాణ ఏర్పాట తర్వాత నుంచి 2015 జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణలోని సింగరేణి కంపెనీ కాలరీస్ లిమిటెడ్ సీఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీధర్ స్థానంలో బలరామ్‌ను సీఎండీగా నియమించిన విషయం తెలిసిందే.



# మీనాక్షి చౌదరి.. మాయ చేస్తోందిగా..

మీనాక్షి చౌదరి.. ఇటీవల కాలంలో ఇండస్ట్రీలో బాగా వైరల్ అవుతున్న హీరోయిన్. అమ్మడు సోషల్ మీడియాలో కూడా తన గ్లామర్ తో సరికొత్త స్టిల్స్ తో ఎంతగానో ఎట్రాక్ట్ చేస్తోంది. ఇక తన తాజా గ్లామర్ ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో సంచలనం సృష్టించారు. ఎర్రటి చీరలో తన అందాల ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్న ఆమె, టాలీవుడ్‌లో నటిగా మాత్రమే కాదు, ఒక ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా ఎదిగారు. నాజూకైన చిరునవ్వు, చీరకట్టులో ఒదిగిపోయిన ఆమె నడుము అందంతో ఫాలోవర్స్ మనసులను దోచేస్తోంది. ఈ ఫోటోలు నెటిజన్లను తెగ ఆకర్షిస్తున్నాయి. హర్యానాలో జన్మించిన మీనాక్షి చౌదరి తన కెరీర్‌ను వెబ్ సిరీస్ 'అవుట్ ఆఫ్ లవ్'తో ప్రారంభించారు. బాలీవుడ్‌లో 'అప్‌స్టార్ట్స్'తో అరంగేట్రం చేసిన ఆమె, తరువాత తెలుగు సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. తన తొలి చిత్రం 'ఇచ్చట వాహనములు నిలుపరాదు'లో నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, తరువాత రవితేజ సరసన 'ఖిలాడీ'లో తన నటనతో ప్రేక్షకుల మనసును గెలుచుకున్నారు. ఆ తర్వాత అడివి శేష్‌తో చేసిన 'హిట్ 2' సినిమాతో మీనాక్షి తొలి సక్సెస్ అందుకున్నారు. ఈ చిత్రం ఆమెకు టాలీవుడ్‌లో ఒక మంచి గుర్తింపును తీసుకొచ్చింది. గుంటూరు కారం చిత్రంలో మహేశ్ బాబుతో కలిసి నటించి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సినిమా పెద్దగా హిట్ కాకపోయినా, మీనాక్షి గ్లామర్ పరంగా ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం మీనాక్షి చేతిలో అనేక ప్రాజెక్టులు ఉన్నాయి. ఇటీవల విడుదలైన 'లక్కీ భాస్కర్'లో దుల్కర్ సల్మాన్ సరసన నటించి ప్రేక్షకుల మనసును దోచుకున్నారు. సినిమా విడుదలైనప్పటి నుంచి మీనాక్షి పేరు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మీనాక్షి మరోసారి తన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. నెక్ట్స్ వెంకటేష్ తో కలిసి నటించిన 'సంక్రాంతి వస్తున్నాం' సినిమా రిలీజ్ కు రెడీ అవుతోంది. ఇక పాన్ ఇండియా మూవీ 'మట్కా'లో వరుణ్ తేజ్ సరసన కనిపించిన విషయం తెలిసిందే. అయితే ఆ సినిమా అంతగా క్లిక్ కాలేదు. ఇక లేటెస్ట్ గా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలను చూస్తే ఆమె ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌పై ఎంత దృష్టి పెట్టిందో అర్థమవుతుంది



# చైతూ పెళ్లిలో కజిన్స్ సందడే సందడి!

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని నాగ చైతన్య, హీరోయిన్ శోభిత ధూళిపాళ.. వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. అక్కినేని కుటుంబ వారసత్వంలో ఒక్కటైన హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో ఘనంగా జరిగింది. టెంపుల్ థీమ్ సెటప్ తో సంప్రదాయ పద్ధతిలో బుధవారం అర్ధరాత్రి వరకు చైతూ, శోభిత వివాహ వేడుక కొనసాగింది. స్టూడియోలోని అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం ఎదురుగా చైతూ.. శోభిత మెడలో వేదమంత్రాల సాక్షిగా మూడు ముళ్ళు వేశారు. మొత్తానికి అక్కినేని వారసుడి పెళ్లి.. తెలుగు సంప్రదాయాలకు అద్దంపట్టేలా జరిగిందనే చెప్పాలి. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు కూడా హాజరయ్యారు.అయితే వివాహ వేడుకకు ముందు.. వరుడు నాగ చైతన్య కజిన్స్ ఫుల్ గా సందడి చేశారు. ఓ రేంజ్ లో నవ్వుకుని చిల్ అయ్యారు. ఆ తర్వాత అంతా కలిపి క్రేజీ పిక్స్ కు పోజు ఇచ్చారు. ఆ ఫోటోను టాలీవుడ్ హల్క్ రానా దగ్గుబాటి సతీమణి మిహీక బజాజ్ పోస్ట్ చేశారు. చైతూ సింగిల్ పిక్ ను కూడా షేర్ చేశారు. పెళ్ళి కొడుకు అంటూ లవ్ ఇమోజీ కాప్షన్ ఇచ్చారు. ఇక గ్రూప్ పిక్ లో నాగ చైతన్య, సుమంత్, సుశాంత్, రానా దగ్గుబాటి, మిహీక, సుశాంత్ సోదరీమణులు, వెంకటేష్ కుమార్తెలతో పాటు మరికొందరు అక్కినేని, దగ్గుబాటి పిల్లలు ఉన్నారు. ఫోటోలో అంతా నవ్వుతూ కనిపించారు. చైతూను సరదాగా ఆట పట్టిస్తున్నట్లు ఉన్నారు. మొత్తానికి పిక్ లో కొత్త పెళ్లి కొడుకు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా నిలిచారు. అదే సమయంలో మిహీక షేర్ చేసిన గ్రూప్ పిక్.. నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. ఫోటో సూపర్ అని అంతా కామెంట్లు పెడుతున్నారు. కజిన్స్ బెస్ట్ మూమెంట్ అని చెబుతున్నారు. చైతూ ముఖంలో పెళ్లి కళ ఉట్టి పడుతుందని అంటున్నారు. బ్యూటిఫుల్ పిక్ అని కాప్షన్ ఇస్తున్నారు. పిక్ ను వైరల్ చేసి ట్రెండ్ చేస్తున్నారు. అయితే మరికొద్ది రోజుల్లో మరోసారి అలాంటి మూమెంట్ అక్కినేని ఫ్యామిలీలో రిపీట్ కానుందన్న విషయం తెలిసిందే. అక్కినేని అఖిల్ పెళ్లి వచ్చే ఏడాది జరగనుంది. రీసెంట్ గా జైనబ్ రవ్జీ తో అఖిల్ ఎంగేజ్మెంట్ జరిగింది. వచ్చే ఏడాది అఖిల్ పెళ్లి జరగనున్నట్లు ఇటీవల నాగార్జున తెలిపారు. అఖిల్, జైనబ్ వివాహం కూడా అన్నపూర్ణ స్టూడియోలోనే జరగనున్నట్లు తెలుస్తోంది. మరి ఇందులో నిజమెంతో వేచి చూడాలి.




# పుష్ప జోరు.. గంటలకు లక్ష టికెట్లు !

అల్లు అర్జున్ పుష్ప 2 జోరు మామూలుగా లేదు. విడుదలకు ముందు ఏ స్థాయిలో అంచనాలను పెంచిందో అదే స్థాయిలో సినిమా విడుదల తర్వాత జోరు కొనసాగుతోంది. సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్ ఏ స్థాయిలో జరిగిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముందు రోజు వరకు దాదాపుగా రూ.135 కోట్ల అడ్వాన్స్ బుకింగ్ జరిగింది. విడుదల రోజు సైతం బుక్ మై షోలో అత్యధికంగా టికెట్లు అమ్ముడు పోతున్నాయి. బుక్ మై షో లో రెండు మిలియన్‌ల ఇంట్రస్ట్‌లతో టాప్ ప్లేస్‌లో ఉన్న పుష్ప 2 టికెట్ బుకింగ్‌లోనూ అదిరి పోయింది. బుక్ మై షో లో చివరి 24 గంటల్లో దాదాపుగా 1.2 మిలియన్ టికెట్లు అమ్ముడు పోయాయి. ఈ విషయాన్ని స్వయంగా బుక్ మై షో చూపిస్తుంది. అంతే కాకుండా ప్రతి గంట గంటకు ఎన్ని టికెట్లు బుక్ అయ్యాయి అనే విషయాన్ని సైతం బుక్ మై షో చూపిస్తూ ఉంటుంది. పుష్ప 2 సినిమా కోసం గంటలకు 97.74 వేల టికెట్లు అమ్ముడు పోయాయి. దాదాపు లక్ష టికెట్స్ గంటలో అమ్ముడు పోవడం అంటే మామూలు విషయం కాదు. గతంలో కల్కి సినిమాకు గంటలకు 95.7 వేల టికెట్లు అమ్ముడు పోయి రికార్డ్‌గా నిలిచింది. ఇప్పుడు పుష్ప 2 బుక్ మై షో లో సరికొత్త రికార్డును నమోదు చేయడం జరిగింది. ఈ స్థాయిలో టికెట్లు అమ్ముడు పోవడం చూసి మైత్రి మూవీ మేకర్స్ వారు సైతం షాక్ అవుతూ ఉంటారు. సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో రెండో షో నుంచి రెగ్యులర్ ఆడియన్స్ సైతం సినిమా కోసం టికెట్లు బుక్ చేస్తూ ఉన్నారు. రివ్యూలు చూసి సినిమాలను చూసే వారు వీకెండ్ కోసం టికెట్లు బుక్ చేస్తూ ఉన్నారు. బుక్ మై షో డాటా ప్రకారం శని, ఆది వారాలకు సంబంధించిన షోలు దాదాపు 70 శాతం ఇప్పటికే హౌస్ ఫుల్ అయ్యాయి. మరో రోజు గ్యాప్ ఉన్న కారణంగా ఆ 30 శాతం షో లు సైతం ఫుల్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. పుష్ప 2 సినిమాలో అల్లు అర్జున్ నటనతో పాటు రష్మిక మందన్న నటన గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. దర్శకుడు సుకుమార్ సినిమాను మరో స్థాయిలో చూపించారు. జాతర ఎపిసోడ్‌తో సినిమా స్థాయి పది రెట్లు పెరిగిందని, కొందరు విమర్శిస్తున్నట్లుగా విలన్ పాత్ర మరీ వీక్‌గా ఏమీ లేదు అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి వీకెండ్ పూర్తి అయ్యే వరకు ఈ సినిమా సాధించబోతున్న వసూళ్లను చూసి బాలీవుడ్ స్టార్స్ సైతం షాక్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సెలబ్రెటీల పాపులర్ లిస్ట్ లో త్రిప్తి డిమ్రీ, శోభిత ,తర్వాతే సమంత

మోస్ట్ పాపులర్ నటీమణుల జాబితాలో శోభిత ధూళిపాళ ప్రముఖ నటి సమంతను వెనక్కి నెట్టారు. ప్రముఖ ఎంటర్ టైన్ మెంట్ పోర్టల్ ఐఎండీబీ విడుదల చేసిన జాబితాలో శోభిత ఐదో స్థానంలో ఉండగా సమంత ఎనిమిదో స్థానంలో నిలిచారు. ఈ ఏడాది 'బ్యాడ్ న్యూజ్', 'లైలా మజ్ను' రీరిలీజ్ 'భూల్ భులయ్యా 3' సినిమాలు విడుదలైన నేపథ్యంలో త్రిప్తి డిమ్రీ ఈ జాబితాలో టాపర్ గా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 250 మిలియన్ సందర్శకుల వాస్తవ వీక్షణల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ ఇచ్చినట్లు ఐఎండీబీ వెల్లడించింది. ఈ జాబితాలో రెండో స్థానంలో దీపికా పదుకొణే, మూడో స్థానంలో ఇషాన్ ఖత్తర్, నాలుగో స్థానంలో షారుక్ ఖాన్ నిలిచారు. ఐదో స్థానంలో శోభిత ధూళిపాళ ఉన్నారు. చైతూతో పెళ్లితో పాటు ఆమె నటించిన మంకీ మ్యాన్ విడుదల సందర్భంగా నెటిజన్లు ఆమె కోసం ఎక్కువగా సెర్చ్ చేశారని ఐఎండీబీ వెల్లడించింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా శార్వరీ, ఐశ్వర్య రాయ్ ఉండగా ఎనిమిదో ర్యాంక్ ను సమంత దక్కించుకున్నారు. సమంత నటించిన 'సిటడెల్: హనీ బన్నీ' విడుదల, హీరోయిన్ అనారోగ్యం తదితర కారణాలతో నెటిజన్లు ఆమె కోసం ఎక్కువగా వెతికారని ఐఎండీబీ వెల్లడించింది.







Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613